క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జన్నారం: నల్లగొండ పట్టణంలో డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) తెలంగాణ రాష్ట్ర ఆరో మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా, మండల నాయకులు బాపు, కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



మాట్లాడుతున్న ఎస్సై శ్వేత

భీమారం: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషించనున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రజలు నిఘా నేత్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని, ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమని పేర్కొన్నారు. సీసీ ఏర్పాటు వల్ల నేరాలు అదుపులో ఉంటాయని, నిందితులను పట్టుకోవడం సులభమవుతుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నాలుగు రోజులు బ్యాంకు సేవలు బంద్

నెన్నెల: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ)ను తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేస్తున్న సందర్భంగా నాలుగు రోజుల పాటు తెలంగాణలో గ్రామీణ బ్యాంకు సేవలకు అంతరాయం ఉంటుందని నెన్నెల, ఆవుడం టీజీబీ మేనేజర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, గోపికృష్ణ తెలిపారు. ఈ నెల 28నుంచి 31వ తేదీ వరకు బ్యాంకు సేవలు నిలిచిపోనున్నట్లు తెలిపారు. యూపీ ఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలు పనిచేయవన్నారు. జనవరి 1నుంచి తిరిగి సేవలు యదావిధిగా కొనసాగుతాయన్నారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు.

సరుకులు అందజేత

కాసిపేట: మండలంలోని దేవాపూర్ అచ్యుతరావు గూడలో గురువారం రాత్రి ఆత్రం సత్యవతి ఇల్లు పూర్తిగా కాలిపోగా, తహసీల్దార్ భోజన్న శుక్రవారం ఆ ఇంటిని పరిశీలించి బాధితురాలిని పరామర్శించారు. ఈ సందర్భంగా తక్షణ సాయంగా 20కిలోల బియ్యం, పప్పు, నూనెలు, వంట సామగ్రి అందించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరుపున బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్ బాధిత మహిళను పరామర్శించి బియ్యం, సరుకులు అందించారు.

తాగునీటి గోస..!

- పది రోజులుగా నిలిచిన సరఫరా
- పంపు మోటారు మరమ్మతుకు తీవ్ర కాలయాపన
- పాట్లు పడుతున్న మాదారం వాసులు



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు



మురికిగా వచ్చిన నీరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏరియా మాదారం టౌన్‌షిప్‌లో తాగునీరు సరఫరా కాక కార్మిక కుటుంబాలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి సరఫరా నిలిచిపోయి పది రోజులు కావస్తున్నా పున:రుద్ధరణ చర్యలు చేపట్టడంలో సింగరేణి అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అరకొరగా వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా, నీరు ఏ అవసరాలకు సరిపోక నానాయాతన పడుతున్నా సింగరేణి అధికారులు చలనం లేకుండా వ్యవహరిస్తున్నారని మాదారం ప్రజలు మండిపడుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా....

కార్మికులు, ప్రజల తాగునీటి ఇబ్బందులు తీర్చడానికి ఐదు వాటర్ ట్యాంకర్లు, ఒక లారీ ట్యాంకర్ ద్వారా తాత్కాలిక ప్రాతిపదికన నీటి సరఫరా చేస్తున్నారు. ఒక్కో ఇంటికి గరిష్టంగా 15నుంచి 20బిందెల వరకు నీళ్లు సరఫరా చేస్తుండటంతో అవి అవసరాలు తీర్చడం లేదు. స్నానం చేయడం, బట్టలు ఉతకడానికి, ఇంటి అవసరాలకు సరిపోవడం లేదంటున్నారు. అనివార్యంగా చేతి పంపుల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని ఈ కారణంగా కార్మికులు, రోజువారీ కూలీలు నీళ్ల కోసం ఇంటి పట్టున ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజులు గడుస్తున్నా తమ తాగునీటి ఇబ్బందులను పట్టించుకోకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని మాదారం వాసులు విమర్శిస్తున్నారు. కాగా సరఫరా చేస్తున్న నీరు తాగడానికి వీలు లేకుండా ఉంటోందని, సరిగ్గా శుద్ధి చేయకపోవడంతో మురికిగా ఉంటున్నట్లు చెబుతున్నారు. సింగరేణి అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి చెడిపోయిన పంపు మోటారుకు సత్వరంగా మరమ్మతు చేయించి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పంపు మోటారు చెడిపోయి..

మాదారం టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న కార్మికులు, కార్మికేతరులకు మూసివేతకు గురైన మహావీర్‌ఖని(ఎంవీకే)–1 గని వద్ద నుంచి నీటి సరఫరా చేస్తున్నారు. ఇక్కడ ప్రత్యేకంగా పంపు మోటారు ఏర్పాటు చేసి ప్రత్యేక పైపులైన్ ద్వారా కొంతకాలం నుంచి కంపెనీ క్వార్టర్లకు నీటి సరఫరా చేస్తున్నారు. కానీ పది రోజుల క్రితం నీటిని తోడే పంపుమోటారు పాడైపోయింది. అంతకు ముందు నెల రోజుల క్రితం పంపు మోటారు కాలిపోగా, స్టాండ్‌బైగా ఉన్న పంపు మోటారును బిగించి నీటి సరఫరాకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం స్టాండ్‌బైగా ఉన్న పంపు మోటారు సైతం రిపేరుకు రావడంతో మరమ్మతు కోసం హైదరాబాద్‌కు పంపారు. రోజులు గడుస్తున్నా ఇంతవరకు పంపు మోటారు రాకపోవడంతో తాగునీటి కష్టాలు మాదారం ప్రజలకు రెట్టింపయ్యాయి.

రెండు రోజుల్లో పునరుద్ధరిస్తాం..

పంపు మోటారును మరమ్మతుల కోసం పంపించాం. బహుషా ఒకటి, రెండు రోజుల్లో మోటారు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అది రాగానే ఓ రోజు బిగించి, మరుసటి రోజు నుంచి నీటి సరఫరాను పున:రుద్ధించే చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, సూపర్ వైజర్, సింగరేణి సివిల్ విభాగం

ఖాళీ బిందెలతో నిరసన



చెన్నూర్‌రూరల్: మండలంలోని గంగారం గ్రామంలో ప్రధాన రహదారిలోని కాలనీవాసులు తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు. తాగునీరు సరఫరా చేసే విద్యుత్ మోటార్ కాలిపోయి ఐదు నెలలు గడుస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో శుక్రవారం కాలనీవాసులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నామని వాపోయారు. వెంటనే కొత్త విద్యుత్ మోటార్ అమర్చి, నీటికష్టాలు తీర్చాలని కోరారు.



దండేపల్లి: పడిపూజలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

వైభవంగా అయ్యప్ప పడిపూజ

మంచిర్యాలఅర్బన్: స్థానిక బైపాస్‌రోడ్ అయ్యప్ప స్వామి ఆలయం వద్ద దివ్యపదునెట్టంబడి మండల పడిపూజ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు–సురేఖ దంపతులు అయ్యప్పస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ అర్చకుడు వడ్లూరి రాజబ్రహ్మం గురుస్వామి పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవా సందర్భంగా ఆరట్టు, అయ్యప్ప అభిషేకం నిర్వహించారు. అయ్యప్పస్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

దండేపల్లి: మండలంలోని గూడెం గుట్టపై గల శ్రీ అభినవ శబరిమలై అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప మహామండల పూజ శుక్రవారం వైభవోపేతంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పదునెట్టాంబడిని పూలతో అలంకరించి, దీపాలు వెలిగించారు. ఉత్సవ విగ్రహాలకు అభిషేక పూజలు, మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. మండల పూజకు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. పూజలు నిర్వహిస్తున్నంతసేపు, అయ్యప్పస్వాముల భజనలు ఎంతగానో అలరించాయి. అనంతరం అయ్యప్పస్వాములు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు



భిక్ష కార్యక్రమంలో పాల్గొన్న కొక్కిరాల సురేఖ



మంచిర్యాలఅర్బన్: పూజలో పాల్గొన్న భక్తులు

డంపింగ్‌యార్డులు నిరుపయోగం



కత్తెరసాలలో...

గ్రామాల్లో చెత్త కనిపించకుండా చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గాను, గ్రామ పంచాయతీకి ప్రత్యామ్నాయ నిధులు సమకూర్చేందుకు గాను గత ప్రభుత్వం పల్లె ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతీ పంచాయతీలో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసింది. కానీ వాటి నిర్వహణ లేకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్‌యార్డులు నిరుపయోగంగా మారుతున్నాయి. పంచాయతీల్లో చెత్తను తీసుకెళ్లేందుకు ఉపయోగించే పంచాయతీ ట్రాక్టర్లు కొన్నిచోట్ల పనిచేయడం లేదు. దీంతో చెత్త డంపింగ్ యార్డులకు తరలడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– చెన్నూర్‌రూరల్

నిబంధనలకు తూట్లు..!

- ప్లాస్టిక్ నిషేధం అమలుపై నిర్లక్ష్యం
- విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో ఇళ్ల మధ్య వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లు

మంచిర్యాలటౌన్: నిత్య జీవితంలో ప్లాస్టిక్ వస్తువుల వాడకం ఒక భాగమైంది. వీటి వినియోగాన్ని నిషేధించాలన్న జాతీయ కాలుష్య నియంత్రణ మండలి సూచనను అన్ని మున్సిపాలిటీల్లో అమల్లోకి తెచ్చినా, పూర్తి స్థాయిలో అరికట్టలేక పోతున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గతేడాది మంచిర్యాల మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వాడకంపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది కఠినంగా వ్యవహరించారు. ఎక్కడ ప్లాస్టిక్ కవర్లు కన్పించినా సీజ్ చేశారు. జరిమానా విధించారు. ప్రస్తుతం అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లా కేంద్రంలో ప్లాస్టిక్ విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.

ప్రజల్లో మార్పుతోనే...

మున్సిపాలిటీల్లో 120మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న పాలిథిన్‌ను పూర్తిగా నిషేధించారు. 120మైక్రాన్ల కంటే మందం తక్కువగా ఉన్నవి, ఒకసారి వాడినవి ఉన్నా, నిల్వ ఉంచినా, విక్రయించినా, ఉపయోగించినా, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ (1986) ప్రకారం సీడీఎంఏ హైదరాబాద్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సామగ్రి జప్తు, రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా, లైసెన్సు రద్దుతో పాటు చట్టప్రకారం చర్యలుంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిషేధం అమలుకు ముందు నుంచే వ్యాపారస్తులకు, ప్లాస్టిక్‌ను విక్రయించే వారికి నిషేధంపై మున్సిపల్ అధికారులు వివరించారు. ప్రజల్లోనూ మార్పు వచ్చేందుకు చేతి సంచితోనే కూరగాయల మార్కెట్‌కు రావాలని, ప్లాస్టిక్ నిషేధం ఉందని, ఎవరూ ప్లాస్టిక్‌ను వినియోగించినా మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్లు ఎక్కడ కనిపించినా, వెంటనే మున్సిపల్ సిబ్బంది వాటిని సీజ్ చేశారు. ఇది ఏడాది క్రితం వరకే చేసి, ఆ తరువాత అధికారులు ప్లాస్టిక్ గురించి పట్టించుకోవడమే మానేశారు. దీంతో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించిన ప్రజలు, తిరిగి వాటి వాడకాన్ని ప్రారంభించారు. బట్ట సంచులను వాడిన వారి చేతుల్లో ఇప్పుడు ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తున్నాయి. ప్రజల్లో స్వచ్ఛందంగా మార్పు వస్తే, ఇంటి నుంచే సంచులను మార్కెట్‌కు తీసుకెళ్లడం వల్ల ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టేందుకు అవకాశం ఉంది.



కూరగాయలకు ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లు

చెత్తలో కలిపేస్తున్నారు...

జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా మంచిర్యాల మున్సిపాలిటీలో 45మెట్రిక్ టన్నుల చెత్త, బెల్లంపల్లిలో 40మెట్రిక్ టన్నులు, మందమర్రిలో 25మెట్రిక్ టన్నులు, లక్సెట్టిపేట, చెన్నూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీల్లో రోజుకు 10మెట్రిక్ టన్నులు, నస్పూర్‌లో 25మెట్రిక్ టన్నుల చెత్త ప్రతీరోజు వెలువడుతోంది. ఇళ్లల్లో నుంచి వెలువడే చెత్తలో తడి, పొడి చెత్తలను ప్లాస్టిక్ కవర్లలోనే వేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అందిస్తున్నారు. ఏడు మున్సిపాలిటీల్లో వెలువడే చెత్తలో 20శాతం ప్లాస్టిక్ కవర్లే ఉండగా, జిల్లాలో దాదాపు 95వేలకు పైగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారని అంచనా. ఒక ప్లాస్టిక్ కవర్ భూమిలో కలిసి పోవాలంటే దాదాపు 100ఏళ్లు పడుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. భూమిపై ప్లాస్టిక్ కవర్లు పడేస్తే వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా అడ్డుకుంటుందని, భూసారం కోల్పోవడంతో పాటు, భూగర్భ జలాలు పెరగకుండా నిరోధిస్తుందని పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్లాస్టిక్ వాడడంపై నిషేధం అమల్లో ఉంది. ప్రజలకు ప్లాస్టిక్ వాడకం చేయొద్దని అవగాహన కల్పించడంతో పాటు, విని యోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. వంద శాతం ప్లాస్టిక్ నిషేధం అయ్యేందుకు కృషి చేస్తాం. ఇందుకు వ్యాపారస్తులు, ప్రజలు కూడా సహకరిస్తే, ప్లాస్టిక్‌ను వందశాతం కనబడకుండా చేసేందుకు అవకాశం ఉంటుంది.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల



మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



నెన్నెలలో సంతాపం ప్రకటిస్తున్న నాయకులు

మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు

- పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు



బెల్లంపల్లి: మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి/నెన్నెల/భీమారం/జన్నారం/మందమర్రిరూరల్/వేమనపల్లి/రామకృష్ణాపూర్: భారతదేశ మాజీ ప్రధాన మంత్రి దివంగత మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కష్టకాలంలో ఉన్న దేశాన్ని ఆర్థికసంస్కరణలతో ముందుకు తీసుకెళ్లిన ఆర్థిక సంస్కర్త అని కొనియాడారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎం.మల్లయ్య, నాయకులు శంకర్, నాతరి స్వామి, గెల్లి జయరాం, ఎండి.అఫ్జల్, నయీమ్, చిన్నరాజం, ఎల్.శ్రీనివాస్, నెన్నెలలో కాంగ్రెస్ నాయకులు చెన్నోజి శంకరయ్య, తోట శ్రీనివాస్, తోడే బాపురెడ్డి, గట్టు బానేష్, తిరుపతిరెడ్డి, కైలాస్, భీమారంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచయ్య, కాంగ్రెస్‌నాయకులు ఆవిడపు రమేష్, చింతల శ్రీనివాస్, జన్నారంలో మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, ఏనుగు సుభాష్ రెడ్డి, మచ్చ శంకరయ్య, దాముక కరుణాకర్, మామిడిపెల్లి ఇందయ్య, దుమల్ల రమేష్, దుర్గం లక్ష్మీనారాయణ, బాదావత్ సుధాకర్ నాయక్, వేమనపల్లిలో మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, నాయకులు ఒడిళ్ల రాజన్న, ఆవులమర్రి పున్నం, పూర్ణచంద్రదారెడ్డి, మధుసూదన్, పురుషోత్తం, శ్రీను పోశం, రాజేషంగౌడ్, సిపెల్లి శ్రీనివాస్, రామకృష్ణాపూర్‌లో నాయకులు అబ్దుల్‌అజీజ్, ధీకొండ శ్యాం గౌడ్, సాగర్‌రెడ్డి, పార్వతి విజయ, పనాస రాజు, గోపురాజం తదితరులు పాల్గొన్నారు.



జన్నారంలో నివాళులు

నల్లా కనెక్షన్ ఇప్పించండి సారూ..!

మందమర్రిరూరల్: మున్సిపాలిటి పరిధిలోని రెండో జోన్ రైల్వేస్టేషన్ రోడ్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట గల కాలనీ వాసులకు మిషన్ భగీరథ పైపులైన్ కనెక్షన్ లేకపోవడంతో కొన్ని నెలలుగా వారికి తాగునీరు సరఫరా కావడం లేదు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇరవై రోజుల క్రితం మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు, కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన కనెక్షన్ ఇప్పించి తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. అయినప్పటికీ ఇంతవరకు కూడా కమిషనర్ స్పందించడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి వెంటనే మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ ఇప్పించి, తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.